సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 30 । జనవరి । 2024



ఆలయాలకు ధర్మకర్తలు..
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ల నియామకానికి దేవాదాయ శాఖ చర్యలు చేపట్టింది. 10లో



విస్తరిస్తున్న కుష్టు
జిల్లాలో చాపకింద నీరులా కుష్టు వ్యాధి విస్తరిస్తోంది. అంటు వ్యాధి కావడంతో ఆందోళన కలిగిస్తోంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
36° / 16°
జిల్లాలో మంగళవారం రాత్రివేళ చలి ప్రభావం ఉంటుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

3 నుంచి సదరం క్యాంపులు

చుంచుపల్లి: జిల్లాలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించనున్న సదరం క్యాంపుల తేదీల వివరాలను డీఆర్డీఏ అధికారులు సోమవారం వెల్లడించారు. ఫిబ్రవరిలో 3,7,14,21,24,28 తేదీల్లో ఆరు రోజులు, మార్చిలో 2,6,13,20,23,27 తేదీల్లో ఆరు రోజులు సదరం క్యాంపులు నిర్వహించనున్నారు. క్యాంపులు కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనుండగా, దివ్యాంగులు మంగళవారం సాయంత్రం నుంచి మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. దివ్యాంగులు ముందస్తుగా సంబంధిత మండలం, మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చేత ప్రాథమిక పరీశీలన చేసి వికలాంగత్వం గుర్తింపు సర్టిఫికెట్‌తోపాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఫోన్ నంబర్‌ను మీ సేవ కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కొత్తగా నమోదు చేసుకునేవారితో పాటు తాత్కాలిక సదరం సర్టిఫికెట్ గడువు ముగిసినవారు మాత్రమే స్లాట్ బుక్ చేసుకోవాలి. ఇందుకోసం రూ.35 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ జి. మధుసూదన్‌రాజు సూచించారు.

కొనసాగిన జేఈఈ మెయిన్స్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్ష మూడో రోజు సోమవారం స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగింది. మొత్తం 131 మంది అభ్యర్థులకు రెండు విడతల్లోనూ అందరూ హాజరయ్యారు. ఏ ఒక్కరూ గైర్హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు.

భారజల సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవం

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఆఫీసర్స్, టెక్నికల్ ఉద్యోగుల పరపతి సంఘం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం ముగిసింది. ఏడుగురు డైరెక్టర్ స్థానాలకు ఎనిమిది మంది నామినేషన్లు వేయగా ఒకరు ఉపసంహరించుకున్నారు. టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీకి చెందిన ఏడుగురు డైరెక్టర్లు కడియాల శివరామకృష్ణ, కంకుమల శ్రావణ్‌కుమార్, పెరిక వాసు, బొమ్మగాని సోమేశ్వర్, తాటి మల్లూరు, నంబూరి జయంతి, యాదగిరి రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, టీఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, ప్రస్తుత అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి డీవై.స్వామి తదితరులు అభినందించారు. కాగా డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఇది ఐదోసారి.

240 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపిక

భద్రాచలంఅర్బన్: స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి గత ఆగస్టులో నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించారు. ఆదివారం ఫలితాలు విడుదల చేయగా, జిల్లా నుంచి 240 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 31న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందజేయనున్నారు. జిల్లా నుంచి ఎంపికైన వారు సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వచ్చి తమ హాల్ టికెట్లను పరిశీలన చేయించుకుని, ఫొటోలు ఇతర సమాచారం అందించారు. అధికారులు వారికి ఐడీ కార్డులు జారీ చేశారు. రెగ్యులర్ నియామకాలు చేపడుతుండటంతో ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశం ఉంది. కాగా, కార్డు ఉన్న వారిని మాత్రమే ఎల్బీ స్టేడియంలోకి అనుమతిస్తారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష తెలిపారు. నూతన స్టాఫ్ నర్సుల నియామకాలతో జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతాయని పేర్కొన్నారు.

ఊరించి.. ఉసూరుమనిపించి...

ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం మొండిచేయి
- రెండు రోజుల్లో ముగియనున్న పాలకవర్గాల పదవీకాలం
- ఐదేళ్లుగా అందని నగదు ప్రోత్సాహకాలు
- ఉమ్మడి జిల్లాలో 116 ఏకగ్రీవ పంచాయతీలు

ఏకగ్రీవ పంచాయతీల నగదు ప్రోత్సాహకాలకు ప్రభుత్వం ఎగనామం పెట్టింది. అదిగో.. ఇదిగో అంటూ ఐదేళ్ల కాలం గడిపింది. గ్రామాల అభివృద్ధికి నిధులు ఉపయోగపడతాయని ఎన్నికలకు వెళ్లకుండా పాలక వర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే చివరకు నిరాశే మిగిలిందని సర్పంచ్‌లు, వార్డు సభ్యులు వాపోతున్నారు. పాలకవర్గాల పదవీకాలం మరో రెండు రోజుల్లో ముగియనుండగా, నగదు ప్రోత్సాహకాలపై సర్పంచ్‌లు ఆశలు వదులుకున్నారు.
– చుంచుపల్లి



రూ.10 లక్షలు ఇస్తామన్నారు..

గ్రామ పంచాయతీలో పోటీ లేకుండా పాలకవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందజేస్తుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు ఇచ్చే రూ.7 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చింది. అదనంగా ఎమ్మెల్యేల నిధుల నుంచి మరో రూ.5 లక్షలు కూడా చెల్లిస్తామని పేర్కొంది. మొత్తం రూ. 15 లక్షలు వచ్చే అవకాశం ఉండటంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చనే ఉద్దేశంతో అనేక పంచాయతీలు ఏకగ్రీవం వైపు మొగ్గు చూపాయి. ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 116 పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలకు 73, భద్రాద్రి జిల్లాలో 481 గ్రామ పంచాయతీలకు 43 ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో అధికంగా కొత్తగా ఏర్పడిన పంచాయతీలే ఉండటం విశేషం. ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకాలతో పంచాయతీలకు ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని పాలకవర్గాలు భావించగా, ప్రభుత్వం మొండిచేయి చూపడంతో సర్పంచులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

ఖమ్మం జిల్లాలో..

చింతకాని మండలంలోని రాఘవాపురం, ఏన్కూరు మండలం జన్నారం, పీకే బంజర, రాయమాధారం, సూర్యతండా, ఎర్రబోడుతండా, కల్లూరు మండలం కొర్లగూడెం, లింగాల, తూర్పులోకారం, నారాయణపురం, ఓబులురావుబంజర, పాయపూర్, పెద్దకోరుకొండి, పుల్లయ్యబంజర, కామేపల్లి మండలం కొత్తలింగాల, లాల్యాతండా, ముచ్చర్ల, పెద్దలింగాల, రుక్కితండా, తాళ్లగూడెం, ఖమ్మంరూరల్ మండలం తెల్దారుపల్లి, కొణిజర్ల మండలం లింగగూడెం, మల్లుపల్లి, మేకలకుంట, ఉప్పలచలక, కూసుమంచి మండలం ధర్మాతండా, గోరీలపాడుతండా, కొత్తూరు, మధిర మండలం అల్లీపురం, కంభంపాడు, రామకృష్ణాపురం, ముదిగొండ మండలం గోకినపల్లి, మేడేపల్లి, నేలకొండపల్లి మండలం శంకరగిరితండా, తిరుమలాపురంతండా, పెనుబల్లి మండలం భవన్నపాలెం, కొత్తలంకపల్లి, లంకపల్లి, పార్థసారథిపురం, రామకృష్ణాపురం, టేకులపల్లి, రఘునాథపాలెం మండలం జీకే బంజర, బాల్యాతండా, దొనబండ, హరియాతండా, కొర్లబోడుతండా, కోయచలక, లచ్చిరాంతండా, మంగ్యాతండా, ఎస్‌వీ బంజర, పుఠానితండా, రాములుతండా, శివాయిగూడెం, సత్తుపల్లి మండలం గంగారం, గౌరిగూడెం, రామగోవిందాపురం, సదాశివపాలెం, తాళ్లమడ, సింగరేణి మండలం కొత్తతండా, పాతకమలాపురం, టేకులగూడెం, తల్లాడలోని మల్సూర్‌తండా, తిరుమలాయపాలెంలోని గోల్‌తండా, ఇస్లావత్ తండా, సోలిపురం, వేంసూరులోని భరణిపాడు, భీమవరం, చోడవరంతండా, వైరా మండలం లింగన్నపాలెం, నారపనేనిపల్లి, ఎర్రుపాలెం మండలం రాంపురం పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి.

భద్రాద్రిలో ఏకగ్రీవ పంచాయతీలివే..

అశ్వాపురం మండలంలో నెల్లిపాక, చర్లలో పెద్దిపల్లి, కుర్నపల్లి, బోధనెల్లి, దుమ్ముగూడెంలో కొత్తపల్లి, కోయ నరసాపురం, అచ్చుతాపురం, పెద్ద కమలాపురం, దబ్బనూతల, మణుగూరులో బుగ్గ, ములకలపల్లిలో రామచంద్రపురం, పాత గుండాలపాడు, పాల్వంచ మండలంలో బంజర, చంద్రాలగూడెం, సత్యనారాయణపురం, సోములగూడెం, బిక్కుతండా, చంద్రుగొండలో దామరచర్ల, చంద్రుగొండ, దమ్మపేట మండలంలో అల్లిపల్లి, అకినేపల్లి, మందలపల్లి, పూసుకుంట, వడ్లగూడెం, గండుగులపల్లి, సీతారాంపురం, గణేష్‌పాడు, అశ్వారావుపేటలో అచ్యుతాపురం, మొద్దులమాడ, పినపాక మండలంలో భూపాలపట్నం, సీతంపేట, పాత రెడ్డిపాలెం, కరకగూడెంలో కొత్తగూడెం, సమత్ మోతే, ఆళ్లపల్లిలో దొంగతోగు, అడవి రామవరం, గుండాలలో దామరతోగు, టేకులపల్లి మండలంలో మద్రాస్‌తండా, సుక్కాల బోడు, యర్రగూడెం, పెట్రాంచెలక, లక్ష్మీదేవిపల్లి మండలంలో గడ్డిగుట్ట, రేగళ్ల గ్రామ పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.30 కోట్లతో విద్యుత్ ప్లాంట్



అశ్వారావుపేట రూరల్ : బయో విద్యుత్ ప్లాంట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు

- పామాయిల్ వ్యర్థాలతోనే బయో ప్లాంట్ నిర్వహణ
- ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌ఫెడ్ సంస్థపై విద్యుత్ భారాన్ని తగ్గించేందుకు రూ.30 కోట్లతో బయో విద్యుత్ ప్లాంట్ నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ, బయో విద్యుత్ ప్లాంట్ తోపాటు నూతనంగా నిర్మిస్తున్న అదనపు ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలించారు. పామాయిల్ ఫ్యాక్టరీలో వచ్చే వ్యర్థాలతోనే బయో విద్యుత్ ప్లాంట్‌ను నిర్వహిస్తారని, ఈ ప్లాంట్ నిర్మాణ పనులను వచ్చే మే నెలలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ అదనంగా మరో 30 టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఫ్యాక్టరీ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్లాంట్ అందుబాటులోకి వస్తే ఆయిల్‌ఫెడ్ సంస్థపై పడుతున్న సుమారు రూ.2.50 కోట్ల విద్యుత్ భారంలో కొంతమేర తగ్గుతుందని అన్నారు. అశ్వారావుపేట ప్రాంతంలో ఆయిల్‌పాం, కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా కోకో, మిరియాలు, వక్క, జాజి సాగు చేయొచ్చని అన్నారు. ఈ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చడమే తన లక్ష్యమని అన్నారు. ఇక్కడి వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ విద్యతోపాటు హార్టికల్చర్ ప్రధాన కోర్సును త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డీఓ, ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ట్రాన్స్‌కో ఏడీ బి.వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, రైతు సంఘం నాయకులు ఆలపాటి రాము, ఆలపాటి రామచంద్ర ప్రసాద్, బండి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, ఎస్‌కే బాజీ, బత్తిన పార్థసారథి, పాలవలస జీవన్‌రావు, నార్లపాటి రాములు పాల్గొన్నారు.



దమ్మపేట : ఫ్యాక్టరీలో యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

కొత్తగా ఐదు ఫ్యాక్టరీలు..

దమ్మపేట: రాష్ట్రంలో కొత్తగా ఐదు పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయనున్నామని, ఆయా ప్రాంతాల్లో ఆయిల్‌పాం గెలల దిగుబడి వచ్చే నాటికి ఫ్యాక్టరీలను అందుబాటులోకి తెస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పామాయిల్ గిట్టుబాటు ధరను టన్నుకు రూ.18 వేలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం డీమక్ నుంచి నీటి వ్యర్థాలను వేరు చేసి పౌడర్ తయారుచేసే ప్లాంట్‌ను పరిశీలించారు. ఫ్యాక్టరీ కెపాసిటీని 60 టన్నుల నుంచి 90 టన్నులకు పెంచుతామని తెలిపారు. భూపట్టాదారు హక్కు పత్రాలు లేకపోయినా, సాగుభూమిలో ఉన్న రైతులు కోరితే పామాయిల్ మొక్కలు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పామాయిల్ విత్తనోత్పత్తి కేంద్రాలను స్థానికంగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్లు బాలకృష్ణ, నాగబాబు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. దరఖాస్తులను స్వీకరించిన కలెక్టర్ పరిష్కార నిమిత్తం ఆయా శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- పాల్వంచ నవభారత్‌లో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో నీటి వసతి కల్పించాలని తల్లిదండ్రులు విన్నవించగా, సమస్యను పరిష్కరించాలని పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- శేఖరం బంజరకు వెళ్లే దారిలో నిర్మించిన సైడ్ కాలువ నాసిరకంగా, అసంపూర్తిగా ఉందని, గాంధీనగర్, ప్రగతినగర్ ప్రాంతాలవారు దరఖాస్తు చేయగా పాల్వంచ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- తన భర్త ఉద్యోగం పెద్దకుమారుడు గండమాల వెంకటేశ్వర్లుకు ఇచ్చానని, అయితే ఆరోగ్యం బాగాలేకపోయినా తనను పట్టించుకోవడం లేదని సుజాతనగర్‌కు చెందిన వృద్ధురాలు గండమాల కమలమ్మ ఫిర్యాదు చేయగా కొత్తగూడెం ఆర్డీఓకు ఎండార్స్ చేశారు.
- చుంచుపల్లి వెంకటేశ్వర కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని, ప్లాట్లు చేసి విక్రయానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోటా శివశంకర్ ఫిర్యాదు చేశారు.

'అవిశ్వాసం' ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ఇల్లెందు: ఫిబ్రవరి 5న ఇల్లెందు మున్సిపాలిటీలో నిర్వహించే అవిశ్వాస సమావేశానికి అధికార పార్టీ ఆటంకాలు కల్పిస్తోందని బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. క్యాంపులో ఉన్న 14 మంది సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం ప్రజావాణిలో అందజేశారు. అధికార పార్టీ నేతలు, ముఖ్యులు ఫోన్ చేస్తూ మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావుకు అనుకూలంగా ఓటు వేయకపోతే ఇబ్బందులు తప్పవంటూ ఒత్తిడి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత కేసులు తిరగదోడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో కటకం పద్మావతి, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, ఎలమందల వీణ, తోట లలిత శారద, సామల మాధవి, చెరుపల్లి శ్రీనివాస్, కడకంచి పద్మ, సందా బింధు, గిన్నారపు రజిత, పాబోలు స్వాతి, కుమ్మరి రవీందర్, వాంకుడోతు తార ఉన్నారు.

13న 'ఎల్టా' పరీక్ష



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న 'ఎల్టా' బాధ్యులు

కొత్తగూడెంఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యాన జిల్లాలోని అన్ని మండలాల్లో సోమవారం విద్యార్థులకు పరీక్ష నిర్వహించినట్లు జిల్లా కోఆర్డినేటర్ షేక్ దస్తగిరి తెలిపారు. కాగా, చుంచుపల్లి మండల స్థాయిలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలను బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించగా ఆయన ప్రశ్నపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మండలాల వారీగా విజేతలకు ఫిబ్రవరి 13న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, కృష్ణవేణి, జానకీదేవి, చందర్ రావు, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల టెక్నికల్ అఫీషియల్‌గా నరేష్

జూలూరుపాడు: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 70వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీ టెక్నికల్ అఫీషియల్‌గా జూలూరుపాడు మండలం కాకర్లకు చెందిన కూరాకుల నరేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను కబడ్డీ అసోసియేషన్ జిల్లాకార్యదర్శి కె.స్వాతిముత్యం సోమవారం అభినందించారు.



కూరాకుల నరేష్

డయాలసిస్ కేంద్రానికి రూ.10 లక్షలు

కొత్తగూడెంరూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ సెంటర్‌లో సౌకర్యాలను మెరుగు పరిచేందుకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఐదు బెడ్‌లతో మాత్రమే కిడ్నీ బాధితులకు రక్తశుద్ధి జరుగుతోంది. మరికొందరు రక్తశుద్ధి కోసం వెయిటింగ్‌లో ఉండగా, సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి అంచనాలు తయారు చేసి తనకు పంపించాలని రవిచంద్ర సూచించారు.

తల్లీబిడ్డల మృతిపై విచారణ

రెండు రోజుల్లో డీఎంఈకి నివేదిక ఇస్తామని అధికారుల వెల్లడి



రామవరంలోని ఎంసీహెచ్‌లో విచారణ చేస్తున్న ప్రొఫెసర్లు

కొత్తగూడెంరూరల్ : జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్‌లో జరిగిన మాత, నవజాత శిశువు మృతిపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 24న సుజాతనగర్ మండలం నాయకులగూడెం గ్రామానికి చెందిన గర్భిణీ చింతాల సింధు కాన్పు నిమిత్తం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేరి, తల్లీబిడ్డలు మృతి చెందిన విషయం విదితమే. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తల్లీబిడ్డలు మృతి చెందారని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించడంతో డీఎంఈ విచారణకు ఆదేశించింది. దీంతో వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ సీహెచ్ లక్ష్మణ్‌రావు, స్త్రీ వైద్య నిపుణులు, ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఖమ్మానికి చెందిన స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ యామినిలు రామవరంలోని మాతా శిశు సంరక్ష కేంద్రంలో విచారణ చేపట్టారు. గైనకాలజిస్ట్ బసంతి, డాక్టర్ సుజన, డాక్టర్ రాము, లతీఫ్, మృతదేహానికి పోస్టుమార్టం చేసిన తేజ్వసిని, వైద్య సిబ్బంది.. మొత్తం 20 మందిని విచారించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతురాలు సింధు తొలుత ఎక్కడ వైద్యం చేయించుకున్నారు? ఎప్పుడు ప్రభుత్వాస్పత్రికి వచ్చారనే విషయాలు సేకరించారు. కేసు షీట్, స్కానింగ్ రిపోర్టులు, పోస్టుమార్టం రిపోర్టు పరిశీలించారు. మృతురాలి బంధువులతో కూడా మాట్లాడారు. ఎంసీహెచ్ ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ వీరబాబును సైతం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ సాగింది. అనంతరం విచారణాధికారులు లక్ష్మణ్‌రావు, విజయలక్ష్మి మాట్లాడుతూ సింధు కడుపులో ఉన్న బిడ్డ చనిపోయాడని గుర్తించిన వైద్యులు ఆమెకు సర్జరీ చేసేందుకు రక్తం తీసి, కొత్తగూడెంలోని సర్వజన ఆస్పత్రికి పంపించారని తెలిపారు. ఆ రిపోర్టు ఫోన్ ద్వారా తెలుసుకుని, రెండు బాటిళ్ల రక్తం సమకూర్చుకుని సర్జరీ చేశారని పేర్కొన్నారు. కానీ ప్లేట్‌లెట్లు ఒక్కసారిగా పడిపోవడంతో ఆమె మృతి చెందిందని చెప్పుకొచ్చారు. విచారణ చేసిన ముగ్గురం ఒక నిర్ణయానికి వచ్చి, రెండు రోజుల్లో డీఎంఈకి నివేదిక ఇస్తామని తెలిపారు.

ఓటరు సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

పరిశీలకురాలు బాలమాయాదేవి



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి, పక్కన కలెక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఓటరు జాబితా పరిశీలకురాలు బాలమాయాదేవి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించగా, నియోజకవర్గాల వారీగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,72,858 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించినట్లు తెలిపారు. 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులలో ఫారం–6కు 1149, ఫారం 7కు 382, ఫారం–8కు 860 దరఖాస్తుల వచ్చినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ నోటిసులు జారీ చేశాకనే జాబితా నుంచి మృతుల పేర్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు, కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు శిరీష, మంగీలాల్, ప్రత్యేక ఉపకలెక్టర్ కాశయ్య, ఎన్నికల విభాగం తహసీల్దార్ దారా ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ రంగా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని, మొదటి సంవత్సరం పరీక్షలకు 10,200 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 9,277 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 16 పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్నామని తెలిపారు. పరీక్ష నిర్వహణకు నియమించిన సిబ్బంది వివరాలను వెల్లడించారు.

తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల జారీ, శాసనమండలి ఎన్నికలకు పట్టభద్రుల నమోదు తదితర అంశాలపై తహసీల్దార్లతో సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్ష చేశారు.

12న నులిపురుగుల నివారణ దినోత్సవం

ఫిబ్రవరి 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 1–19 మధ్య వయసున్న వాళ్లు 3,36,136 మంది ఉన్నారని, వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో, ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఎంహెచ్‌ఓ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మధువరణ్, నాగలక్ష్మి, నాగభూషణం, బేబీ పాల్గొన్నారు. అనంతరం రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాగా భద్రాద్రి కొత్తగూడెం ఎంపిక కాగా డీఎంహెచ్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డును కలెక్టర్ అందజేశారు. ఆ తర్వాత ఎన్‌క్వాస్ విభాగంలో రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు అవార్డులు అందజేశారు.

క్లుప్తంగా

పెద్దమ్మగుడిలో డీసీఎంఎస్ చైర్మన్ పూజలు



పెద్దమ్మగుడిలో పూజలు చేస్తున్న కొత్వాల, తదితరులు

పాల్వంచ: ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్వాల శ్రీనివాసరావు పాల్వంచ మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ బాధ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించగా, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు, పరుచూరి రవికుమార్, యర్రంశెట్టి ముత్తయ్య, నందానాయక్, అనిత, కొండం పుల్లయ్య, వీసంశెట్టి శ్రీను, బాదర్ల జోషి తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో వచ్చే విద్యాసంవత్సరానికి తాత్కాలిక విధానంలో లైబ్రేరియన్ నియామకానికి గిరిజన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఎంఎల్ఐఎస్సీతో పాటు నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండాలని సూచించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పీఓ పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఐలయ్య

అశ్వాపురం: భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశ్వాపురం మండల బీజేపీ అధ్యక్షుడు తాటిపాముల ఐలయ్య నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ సోమవారం ఐలయ్యకు నియామకపత్రం అందజేశారు.


వ్యక్తిపై ఎలుగుబంటి దాడి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న రేంజర్ ఎల్లయ్య

చండ్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామానికి చెందిన నల్లమోతు రామారావుపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మద్దుకూరు గ్రామ శివారులోని మద్దుకూరు ప్రాజెక్ట్ వద్ద గల రైల్వే బ్రిడ్జి వద్దకు రోజులాగే వాకింగ్‌కు వెళ్లిన రామారావుకు ఎలుగుబంటి ఎదురుపడింది. ఖంగుతిన్న రామారావు తప్పించుకునేలోపే మీదపడి గాయపరిచింది. తల, తొడ భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అతడిని విజయవాడ తరలించారు. ఈ ఘటన మండలంలో కలకలం రేపింది. సింగరేణి ఉద్యోగి అయిన రామారావు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు గ్రామస్థులను అప్రమత్తం చేశారు. అటవీశాఖ రేంజ్ అధికారి ఎల్లయ్య గ్రామంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వన్యప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, జంతువుల జాడ కన్పిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: వాహనదారులు రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. 35వ జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రంపూర్ ఏరియాలోని 5 ఇంక్లైన్‌లోని లారీ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డుపై ఇతరులకు ఇబ్బంది కలగకుండా డ్రైవింగ్ చేయాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇసుకను గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

విస్తరిస్తున్న కుష్ఠు

- రుగ్మత నివారణకు 14 రోజులపాటు సదస్సులు
- సర్వే కోసం పనిచేసిన సిబ్బంది 1,757

నేడు జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవం



కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య అధికారులు

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆవిర్భావం నుంచి చాపకింద నీరులా కుష్ఠు వ్యాధి విస్తరిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అంటు వ్యాధి కావడంతో ఆందోళన కలిగిస్తోంది. తగిన సమయంలో చికిత్స పొందకుంటే వ్యాధి మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరక్షరాస్యత, అవగాహన లోపం కారణంగా కుష్ఠు వ్యాధి ఎక్కువగా ప్రబలుతోందని వైద్యులు చెబుతున్నారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వ్యాధి నిర్మూలన కోసం జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ఏటా నిర్వహిస్తోంది. కాగా, గతేడాది ఏప్రిల్ 23 నుంచి డిసెంబర్ వరకు ఇంటింటి సర్వే కూడా నిర్వహించారు. జిల్లాలో కుష్ఠు వ్యాధి క్రమక్రమంగా విస్తరిస్తున్నట్లు గుర్తించారు.

మొత్తం పరిశీలించిన ఇళ్లు	2,30,520
పరిశీలించిన వ్యక్తులు	9,35,476
అనుమానాస్పద కేసులు	2,574
పూర్తిస్థాయిలో పరీక్షించిన కేసులు	30
జిల్లాలో నిర్ధారణ జరిగిన కేసులు	53
గతేడాది వరకు బాధితులు	38
జిల్లా ఏర్పడిన తర్వాత కేసులు	471



కుష్ఠు వ్యాధి సోకినట్లు తెలిపే మచ్చలు

15 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు

జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు నివారణపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తారు.

చాపకింద నీరులా..

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుష్ఠు వ్యాధి వ్యాప్తి చెందుతోందనడానికి తాజా సర్వే గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల జిల్లావ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ, కుష్ఠు వ్యాధి నిర్మూలన శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో 53 కేసులు ఉన్నట్లు తేలగా.. గతేడాది నుంచి ఆ సంఖ్య పెరగలేదు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఒక వేళ తెలిసినా బయటకు చెబితే సామాజికంగా దూరం అవుతామనే భయంతో కుష్ఠువ్యాధిగ్రస్తులు ఇలాగే కాలం గడుపుతున్నారు. ఇతరులకు వ్యాధి సోకడానికి కారణమవుతున్నారని భావించిన ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో 1,417 ఆశ వర్కర్లు, 7 డీపీఎంఓలు, 260 మంది ఏఎన్ఎంలు, 80 మంది సూపర్‌వైజర్ల సాయంతో ఇంటింటి సర్వే నిర్వహించింది. 2,30,520 ఇళ్లలో సర్వే చేసి 9,35,476 మందిని పరీక్షించారు. అందులో అనుమానాస్పదంగా 2,574 మందిని గుర్తించారు. పూర్తిస్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహించి 30 మందికి వ్యాధి నిర్ధారణ చేశారు. 2022లో 38 కేసులు ఉంటే 2023లో 53 మందిని గుర్తించారు. ఈ ఏడాది కూడా సర్వే చేస్తే కేసులు అధికంగా బయటపడే అవకాశం ఉందని వైద్యారోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి.

కుష్ఠు వ్యాధికి ఉచిత చికిత్స



కుష్ఠు వ్యాధి ముఖ్యంగా నరాలకు, చర్మానికి సోకుతుంది. మూడేళ్లలో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. వయస్సు, లింగభేదం లేకుండా ఎవరికైనా సోకుతుంది. వంశపారంపర్యంగా రాదు. ప్రారంభంలో గుర్తించి ఎంబీపీ చికిత్స తీసుకుంటే అంగవైకల్యానికి దారితీయదు. చికిత్స పూర్తయిన, తీసుకుంటున్న వారిలో అంగవైకల్యం ఉంటే శస్త్రచికిత్స ద్వారా సరి చేయొచ్చు. ఈ వ్యాధికి చికిత్స తీసుకుంటే ఆరు నెలల నుంచి ఏడాదిలోగా పూర్తిగా నయమవుతుంది. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో కుష్ఠు వ్యాధికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.

– జేవీఎల్.శిరీష, డీఎంహెచ్‌ఓ

కుష్ఠు నిర్ధారణ పరీక్షలు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా నిర్వహిస్తారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 15 వరకు పక్షం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అందులో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని నిర్ణయించామని డీఎంహెచ్‌ఓ శిరీష తెలిపారు.

బయటకు చెప్పుకోలేక..

కుష్ఠు వ్యాధి ప్రధానంగా మైకో బ్యాక్టీరియా లెప్రీ వల్ల సంక్రమిస్తుంది. వ్యాధిపై అవగాహనలేని ప్రజలతో ఇది తీవ్రరూపం దాల్చుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించి ఏటా నివారణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలు, తండాల్లో వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. ఈ వ్యాధి లక్షణాలు కలిగిన బాధితులను సమాజానికి దూరంగా ఉంచుతారని, చీదరించుకుంటారనే భయంతో బయటకు చెప్పుకోలేక, తీరా వ్యాధి ముదిరిన తర్వాత వెలుగులోకి వస్తున్నారు. వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తిస్తే వెంటనే నయం చేసుకునే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అటవీ మామిడి, జీడి మామిడి తోటలకు వేలం



వేలం నిర్వహిస్తున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

పాల్వంచ: పాల్వంచ డివిజన్ అటవీ శాఖ పరిధిలోని మామిడి, జీడి మామిడి తోటలకు సోమవారం వేలం నిర్వహించారు. అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో పాల్వంచ, దమ్మపేట పరిధిలో ఉన్న 12 ఎకరాల మామిడి, 1,200 ఎకరాల జీడిమామిడి తోటల కాపును 2024 సంవత్సరంలో దక్కించుకునేలా ఈ వేలంను ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అత్యధికంగా పాడుకున్న వారికి తోటలను అప్పగిస్తూ అగ్రిమెంట్ చేశారు. వేలంలో మామిడి తోట రూ.1.70 వేలు, జీడి మామిడి తోటకు రూ.5.90 లక్షలు ఆదాయం లభించింది. కార్యక్రమంలో రేంజర్లు కరుణాకర్‌రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అవస్థలు పట్టించుకునేవారేరి..



మణుగూరులో ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న గిరిజనులు

అశ్వాపురం: మండలంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ప్రజలు మణుగూరు, సారపాక, భద్రాచలం వెళ్తూ అవస్థలు పడుతున్నారు. అశ్వాపురం మండలం మనుబోతులగూడెం గ్రామానికి చెందిన వలస ఆదివాసీ గ్రామస్తులు ఆదివారం సాయంత్రం మణుగూరులో ఆధార్ కేంద్రం వద్దకు చేరుకొని రాత్రి బస చేసి సోమవారం ఉదయం క్యూలైన్‌లో నిలబడ్డారు. చిన్న పిల్లలతో ఉదయం 11 గంటల వరకు గిరిజనులు పడిగాపులు కాశారు. ఇలా మండలంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆధార్ సేవలకు దూర ప్రాంతాలకు వెళ్తూ గంటల తరబడి ఆధార్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. అక్కడే పడిగాపులు కాస్తూ ఇబ్బంది పడుతున్నారు. మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు ఎంతో కాలంగా కోరుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అధికారులు స్పందించి తక్షణమే మండలంలో ఆధార్ కేంద్రం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారిని వేధిస్తున్న కన్నతల్లి?

సామాజిక మాధ్యమాల్లో వైరల్


బూర్గంపాడు: ముక్కుపచ్చలారని చిన్నారిని కన్నతల్లే వేధింపులకు గురిచేస్తున్నదని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో సారపాకలో చర్చనీయాంశంగా మారింది. బసప్పక్యాంపునకు చెందిన ఓ ఐదేళ్ల చిన్నారి చేతులపై వాతలు ఉండటంతో ఇరుగు పొరుగు వారు ఏమైందని ఆ పాపను ప్రశ్నిస్తే 'మా అమ్మ కాల్చిందని' చెప్పడంతో స్థానికులు నివ్వెరపోయారు. బసప్పక్యాంపునకు చెందిన వివాహిత.. మొదటి భర్తతో ఓ పాపను కన్న తరువాత దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చి వేరుగా ఉంటున్నట్లు తెలిసింది. అనంతరం గత ఏడాది మరో వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. అయితే, మొదటి భర్తతో పుట్టిన ఐదేళ్ల పాపతో బసప్పక్యాంపులోనే ఉంటుండగా.. ఇటీవల ఇంకో బాబుకు జన్మనిచ్చింది. ఈక్రమంలోనే ఆమె, రెండో భర్త కలిసి పాపను హింసిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ విషయమై మొదటి భర్త తల్లిదండ్రులు కూడా కోడలిపై ఆరోపణలు చేస్తున్నారు. తమకు తెలియకుండానే ఆమె రెండో వివాహం చేసుకుందని, పాపను కోడలు, ఆమె రెండో భర్త హింసిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆమెపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పాప తనను తల్లే కాల్చి వాతలు పెట్టిందనే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట వివాహిత ఆందోళన

న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని వేడుకోలు

భద్రాచలంఅర్బన్: తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని అక్కడే ఉంటున్నాడని ఆరోపిస్తూ ఓ వివాహిత భద్రాచలం స్టేషన్ ఎదుట సోమవారం ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె వెల్లడించింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఆమె భర్త భద్రాచలంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా, నాలుగేళ్ల కిందట ఆయన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, వారికి ఇద్దరు పిల్లలు జన్మించారని చెప్పింది. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించానని పేర్కొంది. ఈ క్రమంలో తన భర్త మంచిగా చూసుకుంటానని నమ్మించి మళ్లీ మోసం చేశాడని, మరో మహిళతోనే ఉంటున్నాడని వివరించింది. ఇదే విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఆయనపై చర్యలు తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కన్నీటి పర్యంతమైంది. దీంతో స్పందించిన పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రయత్నం చేసినా ఫలితం కానరాలేదని తెలిసింది. దీంతో ఆమె భర్తపై కేసు నమోదు చేసినట్లు భద్రాచలం టౌన్ ఎస్‌ఐ పీవీఎన్.రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



యువకుల మృతదేహాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన రాజుపేట గ్రామశివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజమౌళి కథనం మేరకు.. మండలంలోని ఒడ్డురామవరం గ్రామానికి చెందిన పద్దం వంశీ (20), అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన పద్దం విష్ణు (20) కలిసి ఆదివారం ముత్యాలంపాడు, రాజాపురంలో గ్రామాల్లో జరిగే శుభకార్యానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి ఇంటికి బయలుదేశారు. ఇదిలా ఉండగా రాజుపేట శివారులోని ఇటుకల ఫ్యాక్టరీ వద్ద మృతదేహాలు పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు సమీపంలోని చెట్లపొదల్లో పడి ఉన్న ద్విచక్రవాహనాన్ని గమనించి స్వాధీనం చేసుకున్నారు. బాగా కురుస్తున్న పొగమంచుకు తోడు అతివేగం వల్ల బైక్ అదుపుతప్పి కిందపడి ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. మృతుడు వంశీ తల్లి పద్దం నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ తెలిపారు.

మరో ప్రమాదంలో మహిళ...

దమ్మపేట: బైక్‌ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గణేశ్‌పాడు క్రాస్‌రోడ్డు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన గంజి కరుణ (30) తన భర్త కాళిదాసు, కుమార్తెతో కలిసి మండలపల్లి నుంచి సత్తుపల్లి వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. గణేశ్‌పాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. లారీ కరుణ తల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్వల్పంగా గాయపడిన కాళిదాసు, ఆయన కుమార్తెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

బైండోవర్ ఉల్లంఘనపై రూ.55 వేలు జరిమానా

టేకులపల్లి: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన మహిళకు ఎక్సైజ్ శాఖ అధికారులు రూ.55 వేలు జరిమానా విధించారు. సోమవారం ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ వివరాలు వెల్లడించారు. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం గ్రామానికి చెందిన ఆంగోతు సునీత గతంలో నాటుసారా తయారు చేయడంతో ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. తాజాగా ఆమె బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి సారా తయారు చేసి విక్రయిస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేసి, తహసీల్దార్ కృష్ణవేణి వద్ద బైండోవర్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా సదరు మహిళకు రూ.55 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రమాదేవి, సిబ్బంది రవిబాబు, బాబా, యాకూబ్‌పాషా, మల్లికార్జున్, చారి, తులసి పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యపై కేసు

దుమ్ముగూడెం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మచ్చా సాధిక (20) ఆత్మహత్య చేసుకోగా సోమవారం ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేశారు. ఆయన కథనం ప్రకారం.. భీమవరం గ్రామానికి చెందిన మచ్చా పుల్లయ్య కూతురు సాధిక టీటీసీ పూర్తి చేసి ప్రస్తుతం భద్రాచలంలో కంప్యూటర్ కోర్సు చేస్తోంది. ఈ నెల 25వ తేదీన ఇంటికి వచ్చి ఎవరితోనూ మాట్లాడకుండా ఉంటోంది. 28వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సాధిక మృతిపై అనుమానాలు ఉన్నాయని న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేశ్ తెలిపారు.

27 కేజీల గంజాయి స్వాధీనం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా 21.5 కేజీల ఎండు గంజాయి దొరికింది. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచందర్ కథనం ప్రకారం.. కొత్తగూడెం బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఉన్న బస్తా సంచిలో పెట్టిన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి విలువ రూ.5.25 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఎండు గంజాయి ఎవరూ తీసుకొచ్చారనే విషయంపై విచారణ జరుగుతోందని చెప్పారు. తనిఖీల్లో కొత్తగూడెం ఆబ్కారీ సీఐ జయశ్రీ, ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది హబీబ్‌పాషా, రామకృష్ణగౌడ్, వెంకటనారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.

పాల్వంచలో...



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పాల్వంచ: మోటార్ సైకిల్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో మండలంలోని జగన్నాథపురం ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు అనుమానాదాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఉన్న సంచిలో ఆరు కేజీల గంజాయి ఉండటంతో సీజ్ చేసి, మోటార్ సైకిల్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వారు సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన పశ్చిమల్ల రాము, కల్లటి అరవింద్‌గా గుర్తించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో సిబ్బంది కరీం, హరీశ్, వెంకట్, సుధీర్ పాల్గొన్నారు.

సుజ్ఞానపురంలో చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా సోమ్లా ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన సోమ్లా వ్యవసాయ పనుల నిమిత్తం వడ్డీ వ్యాపారి వద్ద రూ.లక్షా పది వేలను తీసుకున్నాడు. ఆ నగదును ఇంట్లోని బీరువాలో పెట్టి భార్యతో కలిసి మణుగూరు వెళ్లాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు పగులకొట్టి అందులోని రూ.లక్షా పది వేలను అపహరించారు. మణుగూరు నుంచి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

108లో ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

టేకులపల్లి: 108 అంబులెన్స్‌లో ప్రసవం జరిగిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన కొవులూరు సందీప్ భార్య శ్రావణికి పురిటినొప్పులు అధికం కావడంతో 108లో సులానగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి సిబ్బంది రామవరం ఎంసీహెచ్‌కు రిఫర్ చేయగా అదే అంబులెన్స్‌లో బయలుదేరారు. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఆర్‌సీపీ డాక్టర్ మనీశ్ సూచనలతో ఈఎంటీ అశోక్ ప్రసవం చేశారు. తల్లీ, బిడ్డ ఇద్దరినీ రామవరం ఆస్పత్రిలో చేర్చారు.

క్లుప్తంగా...



అధునాతన ప్రభుత్వ పాఠశాలను

చూసి ఆశ్చర్యపోయా

ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ (ట్విట్టర్) వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. సోమవారం ఆయన స్వగ్రామం బాపట్లకు సమీపంలోని కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, తరగతి గదుల్లో విద్యార్థుల బల్లలపై కూర్చుని, ఫొటోలు దిగి ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టు చేశారు. 'అందంగా, అధునాతనంగా మారిన కర్లపాలెం ప్రభుత్వ పాఠశాలను చూసి నాకు చాలా సంతోషంగాను, ఆశ్చర్యంగా అనిపిస్తోంది' అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సర్వీస్ నిబంధనపై హైకోర్టు స్టే

సాక్షి, హైదరాబాద్: సూపర్ స్పెషాలిటీ కోర్సులు పూర్తి చేసిన పీజీ విద్యార్థులు ఓ ఏడాది పాటు ప్రభుత్వ సర్వీస్ చేయాలని, అలా చేయకుంటే రూ.50 లక్షలు జరిమానా చెల్లించాలన్న సర్కార్ నిబంధనపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అలాగే ప్రభుత్వ సర్వీసు నిమిత్తం కేటాయించిన సంబంధిత కాలేజీల్లో చేరాలంటూ వైద్యవిద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను కూడా నిలిపివేసింది. సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసిన వారు ప్రభుత్వ సర్వీసు చేయాలని, లేని పక్షంలో రూ. 50 లక్షలు జరిమానా చెల్లించాలని... ఈ మేరకు అంగీకారం తెలుపుతూ బాండ్ సమర్పించాలన్న నిబంధనను సవాలు చేస్తూ డాక్టర్ అన్వేష్‌కుమార్‌రెడ్డి మరో 22 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ఎస్‌వీ శ్రావణ్ కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పై రెండు అంశాలపై స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు పిటిషనర్లకు మాత్రమే వర్తిస్తాయన్నారు. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 14కు వాయిదా వేశారు.

ఏపీ స్కూళ్లలో పెరిగిన చేరికలు

టాప్-4 రాష్ట్రాల్లో ఏపీకి తొలిస్థానం

- సంస్కరణలతో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్కూళ్ల స్థాయిలో భారీ పెరుగుదల
- జాతీయ స్థాయిని మించి ఏపీలో స్థూల నమోదు నిష్పత్తి పెరుగుదల
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. 2021 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి (పిల్లలు చేరికలు)లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండడమే ఇందుకు నిదర్శనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2017తో పోలిస్తే 2021లో దేశంలోని స్థూల నమోదు నిష్పత్తి పెరిగిన టాప్- రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తొలిస్థానంలో ఉందని ఆ నివేదిక తెలిపింది. అలాగే, 2021లో జాతీయ స్థూల నమోదును మించి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధిక స్థూల నమోదు ఉందని కూడా పేర్కొంది. 2017తో పోలిస్తే.. 2021లో రాష్ట్రంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, ఎలిమెంటరీ స్థాయిలో స్థూల నమోదు నిష్పత్తి భారీగా పెరిగిందని కూడా నివేదిక తెలిపింది.

'అమ్మఒడి' ప్రోత్సాహంతోనే..

స్థూల నమోదు నిష్పత్తిలో టాప్ నాలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తరువాత ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ ఉండగా.. స్థూల నమోదు 2017తో పోలిస్తే 2021లో తగ్గిన నాలుగు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, గోవా, జార్ఖండ్, బిహార్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2017తో పోలిస్తే 2021లో ప్రైమరీలో 18.4 శాతం, అప్పర్ ప్రైమరీలో 13.4 శాతం, ఎలిమెంటరీలో 16.5 శాతం స్థూల నమోదు పెరిగినట్లు నివేదిక తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉంచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. అన్ని వర్గాల్లోని పేదల తల్లిదండ్రులకు తమ పిల్లల చదువులు భారం కాకూడదనే దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకం అమలుచేస్తోంది. ఈ పథకం అమలు ద్వారా పేద వర్గాల పిల్లలందరూ స్కూళ్లలో చేరేలా ప్రోత్సాహం అందిస్తోంది. జగనన్న అమ్మఒడి ద్వారా పిల్లలను స్కూళ్లకు పంపితే ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో అన్ని వర్గాల్లోని పేదలు తమ పిల్లలను స్కూళ్లకు పంపుతున్నారు.

స్థూల నమోదు వృద్ధికి దోహదపడిన సంస్కరణలు..

- మనబడి నాడు-నేడు ద్వారా తొలిదశలో.. 15 వేలకు పైగా ప్రభుత్వ స్కూళ్లలో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో దశలో మరో 22,221 స్కూళ్ల రూపురేఖలను మార్చే పనులు చేపట్టారు.
- దీంతోపాటు.. పిల్లలు మధ్యలో చదువు మానేయకుండా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా చర్యలను తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. పిల్లలు ఎవరైనా స్కూళ్లకు వెళ్లకపోతే వలంటీర్లు ఆ పిల్లల తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లి కారణాలు తెలుసుకుని తిరిగి స్కూళ్లకు వచ్చేలా ప్రభుత్వం చర్యలను తీసుకుంది.
- స్కూళ్లకు వచ్చే పిల్లలకు జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోంది.
- పేద పిల్లల చదువులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తల్లిదండ్రులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా కిట్‌ను అందిస్తోంది.
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంను కూడా అమలుచేస్తోంది. పిల్లలకు ట్యాబులను కూడా అందిస్తోంది. ఈ చర్యలన్నీ కూడా పాఠశాలల్లో స్థూల నమోదు నిష్పత్తి పెరగడానికి దోహదం చేశాయి.

రాజ్యసభ 3 స్థానాలూ వైఎస్సార్‌సీపీకే..



సాక్షి, అమరావతి: ఏపీలో వచ్చే ఏప్రిల్ 2న ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీకే దక్కనున్నాయి. గతంలో రాష్ట్ర కోటాలో రాజ్యసభకు ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ), సీఎం రమేష్ (బీజేపీ)ల పదవీకాలం ఏప్రిల్ 2తో పూర్తికానుంది. వీటికి ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం శాసనసభలో ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడు రాజ్యసభ స్థానాలూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరడం ఖాయం. దీంతో రాష్ట్ర కోటాలో మొత్తం 11 స్థానాలూ వైఎస్సార్‌సీపీ పరమవుతాయి. అంటే.. ఏప్రిల్ 2 తర్వాత రాజ్యసభలో టీడీపీ ఉనికే లేకుండాపోతోంది. ఆ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకూ 41 ఏళ్లలో రాజ్యసభలో టీడీపీకి ప్రాతినిధ్యం లేకుండా పోవడం ఇదే ప్రథమం అవుతుంది. ఇక రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతం ఆ సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని దేశంలోని రాష్ట్రాల ఎమ్మెల్యేలు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. మన రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో సత్సంబంధాలు నెరిపి.. అవినీతి కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఈ ఎనిమిది స్థానాలు వైఎస్సార్‌సీపీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి సీఎం జగన్ చాటిచెప్పారు.

దివ్యాంగుడికి 'గోవర్ధన' నిలయం

- దివ్యాంగుడికి ఇల్లు కట్టించి ఇచ్చిన మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- రూ.10 లక్షల సొంత డబ్బు వెచ్చించి



గంప గోవర్ధన్ కట్టించి ఇచ్చిన ఇల్లు



కామారెడ్డి క్రైం: నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రహదారిలో.. కామారెడ్డి మున్సిపల్ పరిధి పాత రాజంపేటలోని రైల్వే గేటు పక్కనే ఓ చిన్న పూరి గుడిసె ఉండేది. వర్షం పడినప్పుడల్లా ఇళ్లంతా కురవడంతో నీరు చేరి అందులోని ఓ దివ్యాంగుడు, కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డు మీదుగా వెళ్తున్నప్పుడల్లా వారి అవస్థలను మాజీ ఎమ్మెల్యే, అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గమనించేవారు. ఈ క్రమంలో 8 నెలల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన గంప గోవర్ధన్ వద్దకు రెండు కాళ్లులేని దివ్యాంగుడు షేక్ ఖాదర్ వెళ్లి తన గోడును వెళ్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన గోవర్ధన్ మీ అవస్థలను గమనించానని, మీకు సొంతిల్లు కట్టిస్తానని మాట ఇచ్చారు. వెంటనే రూ.10 లక్షలు తన సొంత డబ్బును వెచ్చించి 80 గజాల విస్తీర్ణంలో హాలు, కిచెన్, బెడ్‌రూం, ఇతర అన్ని సౌకర్యాలతో నిర్మాణం పూర్తయిన ఆ పక్కా ఇంటిని గోవర్ధన్ ఆదివారం ప్రారంభించారు. సొంత డబ్బుతో ఇంటిని నిర్మించి ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఔదార్యంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..: గంప గోవర్ధన్

రైల్వే గేటు సమీపంలోని గుడిసెలోకి వర్షం నీరుచేరి దివ్యాంగుడు ఖాదర్, కుటుంబం ఇబ్బంది పడటం చాలా సార్లు గమనించాను. అతనికి ఏదైనా సహాయం చేయాలనుకున్నా. మరో చోట ఇల్లు కట్టిస్తానంటే వద్దన్నాడు. దాంతో గుడిసె ఉన్న స్థలంలోనే సొంత డబ్బుతో ఇల్లు నిర్మించి ఇచ్చాను. ఓ దివ్యాంగుడికి సహాయపడినందుకు సంతృప్తిగా, సంతోషంగా ఉంది.

నిజాంషుగర్స్ పునరుద్ధరణ కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్‌బాబు

బోధన్: మూతపడిన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య ఉన్నత శాఖాధికారులు 10 మందితో కమిటీ వేసింది. కమిటీ చైర్మన్‌గా పరిశ్రమలు, ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కో చైర్మన్‌గా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి, పరిశ్రమల, వాణిజ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ షుగర్ అండ్ కేన్ కమిషనర్ కమిటీలో ఉన్నారు. ఈనెల 12న కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 4ను జారీ చేసింది. బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని 1938లో నిజాం హయాంలో నెలకొల్పారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీల విస్తరణకు దోహదపడింది. 2002లో చంద్రబాబు హయాంలో బోధన్, ముత్యంపేట (జగిత్యాల), ముంబోజిపల్లి (మెదక్) ఫ్యాక్టరీలను ప్రైవేట్ చేశారు. దీంతో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) రూపాంతరం చెందింది.

రెండు దరఖాస్తులు చాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఎండీ, డీఎన్‌బీ ఇలా 67,802 పీజీ మెడికల్ సీట్లున్నాయి. జాతీయ, రాష్ట్రస్థాయి రెండింటిలోనూ సీట్లను నీట్ ప్రవేశపరీక్ష ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం అఖిల భారత ర్యాంకు ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేస్తున్నారు. అభ్యర్థులు తమ రాష్ట్ర పరిధిలో దరఖాస్తు చేసుకున్నప్పుడు.. వారిని రాష్ట్ర కేటగిరీగా గుర్తించి, తదనుగుణంగా మెరిట్ జాబితాలను తయారు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం అన్ని మెడికల్ కాలేజీల్లోని 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు, డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ నిర్వహించేది. అభ్యర్థులెవరైనా ఈ 15 శాతం ఆలిండియా కోటా సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక రాష్ట్ర కోటా, రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్లకోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాల్లోని కాలేజీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ అధికారులు కూడా.. ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని సీట్లకు ఆలిండియా ర్యాంకుల ఆధారంగా మెరిట్ జాబితాలు తయారు చేసి అడ్మిషన్లు చేస్తారు.

ప్రైవేట్ సీట్లకూ జాతీయస్థాయి కౌన్సెలింగ్

ప్రస్తుతం రాష్ట్రాల్లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లకు ఆయా రాష్ట్రాల్లోనే కౌన్సెలింగ్ జరుగుతోంది. వాటిలో కన్వీనర్ కోటాకు వేరుగా, బీ కేటగిరీ, ఎన్నారై కోటాల సీట్లకు వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వీటిలోని ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ కౌన్సెలింగ్ కోసం వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. ఎన్ఎంసీ నిర్ణయం అమల్లోకి వస్తే.. ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కాలేజీల్లోని వివిధ కేటగిరీల సీట్లకు ఒకే దరఖాస్తు సరిపోతుంది, ఒకేసారి కౌన్సెలింగ్ జరుగుతుంది.

- ఉదాహరణకు తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉన్న బీ కేటగిరీ సీట్లలో 85 శాతం స్థానికులకు కేటాయించగా, మిగతా 15 శాతం ఓపెన్ కేటగిరీ సీట్లకు దేశంలోని ఏ రాష్ట్రం వారైనా పోటీపడొచ్చు.

ఈ ఓపెన్ కేటగిరీ రిజర్వేషన్లు వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒకే దరఖాస్తు ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కాలేజీల్లో ఎక్కడో ఒకచోట సీటు పొందవచ్చు. నచ్చినచోట చేరవచ్చని, లేకుంటే తదుపరి కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఎన్ఎంసీ అధికారులు చెప్తున్నారు.

- గత ఏడాది దేశవ్యాప్తంగా 20.87 లక్షల మంది నీట్ యూజీ పరీక్ష రాశారు. మొత్తం 11,45,976 మంది అర్హత సాధించగా.. అందులో ఏపీ నుంచి 42,836, తెలంగాణ నుంచి 42,654 మంది ఉన్నారు.

జిల్లా వార్తలు

ఘాటు రావొద్దని..



ఖమ్మం మార్కెట్ యార్డులో ట్యాంకర్‌తో నీరు చల్లుతున్న దృశ్యం

మిర్చిలో మిగతా రకాలతో పోలిస్తే 'తేజా' రకం ఎక్కువ ఘాటు ఉంటుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించేది కూడా తేజా రకం మిర్చినే. ఈ మిర్చి ఘాటు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం మిర్చి విక్రయాలు పెరగటంతో మార్కెట్‌లో అధికార యంత్రాంగం నియంత్రణ చర్యలు చేపట్టింది. మార్కెట్ యార్డు, పరిసర ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటిని చల్లుతూ మిర్చి ఘాటు నుంచి కొంత మేరకు ఉపశమనం కలిగిస్తున్నారు. – ఖమ్మం వ్యవసాయం

ఆలయాలకు ధర్మకర్తల మండళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 19 దేవాలయాలకు నూతన కమిటీలు

- ఆదేశాలు జారీ చేసిన దేవాదాయ శాఖ కమిషనర్
- దరఖాస్తు చేసుకునేందుకు 20 రోజుల గడువు



చింతకానిలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం

ఖమ్మంగాంధీచౌక్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ల నియామకానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ చర్యలు చేపట్టింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 84 దేవాలయాలు మండళ్ల నియామకానికి అర్హత కలిగి ఉండగా.. ఇందులో 19 ఆలయాలకు ప్రస్తుతం మండళ్లను నియమించనున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని అధికారులను శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. రూ.5 లక్షలు, ఆపైన ఆదాయం కలిగిన ఆలయాలకు ఐదుగురితో, రూ.25 లక్షలు ఆపైన ఆదాయం కలిగిన ఆలయాలకు ఏడుగురితో కూడిన కమిటీలను నియమించాలని సూచించారు. కాగా, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు లేదా నిబంధనల ప్రకారం అర్హులైన వారు నోటిఫికేషన్ వెలువడిన ఇరవై రోజుల్లోగా ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది.

ఖమ్మం జిల్లాలో 12 ఆలయాలు

ఖమ్మం జిల్లాలో ధర్మకర్తల మండళ్లు నియమించనున్న ఆలయాల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం సుగ్గలవారి తోటలోని శ్రీ అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి, ఎన్నెస్పీ క్యాంపులోని శ్రీ సీతారాంజనేయస్వామి, ఖమ్మం ధంసలాపురంలోని శ్రీ శంభులింగేశ్వరస్వామి, వైరా మండలం గొల్లపుడిలోని శ్రీ పులిగొండ లక్ష్మీనరసింహస్వామి, పల్లిపాడులోని శ్రీ శంభులింగేశ్వర స్వామి, ముదిగొండ మండలం చిరుమర్రిలోని శ్రీ రామలింగేశ్వరస్వామి, పెద్దమండవలోని శ్రీ రాజావేణుగోపాల స్వామి, వేంసూరు మండలం కుంచపర్తిలోని శ్రీ మారెమ్మ, వేంసూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లను నియమిస్తారు. ఇంకా చింతకానిలోని శ్రీ చెన్నకేశవ స్వామి, కల్లూరులోని శ్రీశివుడు, ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లలోని శ్రీ సిద్ధి మల్లేశ్వర స్వామి దేవాలయాల నూతన ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరులోని నీలకంఠేశ్వర స్వామి, బూర్గంపాడు మండలం మోతెగడ్డలోని శ్రీవీరభద్రస్వామి, భద్రాచలంలోని శ్రీ కుసుమ హరనాథ బాబా, పాల్వంచ మండలంలోని నవనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయాలతోపాటు పాల్వంచలోని శ్రీ రామాలయ భజన మందిరం, ఇల్లెందులోని శ్రీ హరిహర క్షేత్రాలకు నూతనంగా ధర్మకర్తల మండళ్ల నియామకానికి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కమిషనర్ ఆదేశించారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు చేరాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



కంటి సమస్యను పీఓకు వివరిస్తున్న పూనెం భద్రమ్మ

భద్రాచలం: మారుమూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల వద్ద నుంచి వినతిపత్రాలు, పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు వాటిని అందజేసిన పీఓ సత్వరమే పరిశీలించి అర్హతల మేరకు వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజనుల చెంతకు ప్రభుత్వ పథకాలు చేరేలా యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోడు భూములు సమస్యలు, రైతుబంధు రుణాలు, పోడు భూములకు పట్టాలు, వ్యవసాయానికి విద్యుత్ మోటార్లతో పాటు ట్రైకార్ సబ్సిడీ రుణాల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, అధికారులు టి.వెంకటేశ్వరరాజు, సురేశ్‌బాబు, మునీర్‌పాషా, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అప్పటికప్పుడే ప్రభుత్వ ఆస్పత్రికి..

దుమ్ముగూడెం మండలం నడిగడ్డకు చెందిన పూనెం భద్రమ్మ తాను కంటి సమస్యతో బాధపడుతున్నట్లు గిరిజన దర్బార్‌లో పీఓకు విన్నవించింది. ఆమె సమస్యను తెలుసుకున్న పీఓ.. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఇటీవలే కంటి చికిత్సకు సంబంధించి ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించారని చెప్పి తన అధికార వాహనంలో ఆమెను ఆస్పత్రికి పంపించారు. దీంతో వైద్యులు ఆమెను పరీక్షించి ఫిబ్రవరి 2వ తేదీన శస్త్రచికిత్స చేస్తామని చెప్పడంతో భద్రమ్మ వైద్యులతో పాటు పీఓకు కృతజ్ఞతలు తెలిపింది.

'వృక్ష మిత్ర'లకు పూర్తయిన శిక్షణ



యంత్రాలు అందుకున్న వారితో డీన్ శ్రీనివాసరెడ్డి, తదితరులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏపీ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యాన కొబ్బరిచెట్లు ఎక్కడంతోపాటు తెగుళ్లను గుర్తించే అంశాలపై కొబ్బరి వృక్ష మిత్రలుగా ఎంపిక చేసిన వారికి ఇచ్చిన శిక్షణ పూర్తయింది. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో ఆరు రోజుల పాటు వారికి క్షేత్ర స్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చివరిరోజు వారికి కొబ్బరి చెట్లు సులువుగా ఎక్కేందుకు ఉపయోగపడే యంత్రాలను కళాశాల ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ ఐవీ శ్రీనివాసరెడ్డి పంపిణీ చేశారు. అలాగే, శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు, ధ్రువీకరణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జయమ్మ, కె.నాగాంజలి, రమేశ్, పావని, శిరీష, నీలిమ, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

కలల కొలువు.. నిజమైన వేళ



- స్టాఫ్‌నర్స్‌లుగా ఉమ్మడి జిల్లా నుంచి 565 మంది
- రేపు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు
- వైద్యరంగంలో కొనసాగుతూనే ఎంపిక

వైద్యరంగంలో స్థిరపడాలన్న ఆకాంక్షకు అనుగుణంగా పట్టుదలతో చదివారు. అందుకు తగినట్లుగా జీఎన్ఎం పట్టా పొందారు. ప్రభుత్వ కొలువు కోసం సుదీర్ఘకాలంగా ఎదురు చూశారు. ఈ విషయంలో ఆలస్యమైనా నిరాశ చెందకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు విధానంపై లేదంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో కొనసాగుతూ వచ్చారు. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోగా... ప్రభుత్వం తాజాగా ఫలితాలు వెల్లడించింది. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి 325మందికి, భద్రాద్రి జిల్లా నుంచి 240 మందికి అవకాశం దక్కింది. వీరికి హైదరాబాద్‌లో బుధవారం జరిగే సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందచేయనున్నారు. ఈమేరకు స్టాఫ్‌నర్స్‌లుగా ఎంపికైన పలువురి అభిప్రాయాలు ఇలాఉన్నాయి. – ఇల్లెందురూరల్

గ్రామంలో నేనే మొదటి ఉద్యోగిని..



మా గ్రామానికే చెందిన జర్పుల భద్రాజీతో నా వివాహం జరిగింది. నన్ను నా భర్త జీఎన్ఎం చదివించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూనే స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించా. కుటుంబ సహకారంతో మా గ్రామంలో తొలి ప్రభుత్వ ఉద్యోగినిగా నిలిచా.

– గుగులోత్ శ్రావణి, అమర్‌సింగ్ తండా, ఇల్లెందు మండలం

ఆకాంక్ష నెరవేరింది..



వైద్య రంగంలో స్థిరపడాలన్న నా ఆకాంక్షను కుటుంబీకులు ప్రోత్సహించారు. జీఎన్ఎం కోర్సు పూర్తిచేశాక కాంట్రాక్టు పద్ధతిపై గుండాల ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేశా. ఎట్టకేలకు స్టాఫ్‌నర్స్‌గా ప్రభుత్వ ఉద్యోగం రావడంతో నా కల నెరవేరింది.

– మోకాళ్ల స్వాతి, కొత్తూరు, ఇల్లెందు మండలం

వైరా మండలం నుంచి ...



గడ్డం మౌనిక



కట్టా పార్వతి

వైరారూరల్: స్టాఫ్‌నర్సులుగా వైరా మండలంలోని గొల్లపూడి, తాటిపూడి గ్రామాలకు చెందిన గడ్డం మౌనిక, కట్టా పార్వతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు వారిని అభినందించారు.



ఆసిఫ్, హనీఫ్

అన్నదమ్ముల ఎంపిక

వైరా: ఒకే ఇంటి నుంచి ఇద్దరు స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్లు(స్టాఫ్ నర్స్)గా ఎంపికయ్యారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన ఎల్ఐసీ అడ్వైజర్ ఎస్.కే.గౌస్‌మియా – మహబూబ్‌బీ దంపతుల కుమారులు హనీఫ్ పాషా, ఆసిఫ్‌పాషా రాష్ట్రప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించింది. అన్నదమ్ములిద్దరికీ ఒకేసారి, ఒకే ఉద్యోగాలు లభించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్యే... డాక్టరు రాగమయి!



చిన్నారిని పరీక్షిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ: తల్లాడ మండలంలో పలు కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి డాక్టర్‌గా తన వృత్తిధర్మాన్ని కూడా నెరవేర్చారు. మండలంలోని గూడూరుకు వచ్చిన ఎమ్మెల్యే రాగమయి అక్కడ ఓ చిన్నారి నీరసంగా ఉండడాన్ని గుర్తించారు. దీంతో సదరు చిన్నారిని పరీక్షించి అవసరమైన మందులు రాసిచ్చారు. ఎమ్మెల్యేగా బిజీ అయినప్పటికీ వైద్యురాలిగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు అభినందించారు.